# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

ఆదివారం | 19 మే, 2024 | పేజీలు : 05


## టిఎస్ స్థానంలో టిజి తక్షణమే అమలు

కలెక్టర్ పమేలా సత్పతి




ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః టిఎస్ స్థానంలో టిజి అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో జిల్లాలోని అన్ని శాఖల ఉన్నతాధికారులు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులను అమలు చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్ర అబ్రివేషన్స్ సూచించే టిఎస్ స్థానంలో టిజిని వినియోగించేందుకు కేంద్రం అనుమతిస్తూ గెజిట్ జారీ చేసిన దృష్ట్యా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయని పేర్కొన్నారు. జిల్లాలో ఇకపై అన్ని ప్రభుత్వ కార్యాలయాలు

తరువాయి 5లో

### జూన్ 9న గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షలను
## పకడ్బందీగా నిర్వహించాలి

బయో మెట్రిక్ హాజరు దృష్ట్యా ఉదయం 9:-00 గంటల నుండి పరీక్షా కేంద్రంలోకి అనుమతి

ఉదయం గం 10:-00 ల తర్వాత పరీక్షా కేంద్రంలో అనుమతి ఉండదు

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి: జూన్ 9న నిర్వహించు గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్ష ఏర్పాట్ల పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో సమావేశంలో సమీకృత జిల్లా కలెక్టరేట్ వీడియో సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా ఎస్‌పి అఖిల్ మహాజన్,అదనపు కలెక్టర్ పి.గౌతమిలతో కలిసి పాల్గొన్నారు. గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షకు దాదాపు 4లక్షల పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని, జూన్ 9న ప్రిలిమినరీ పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పరీక్షను పకడ్బందీగా, సజావుగా నిర్వహించేందుకు అన్ని అవసరమైన ఏర్పాట్లను పరిశీలించి పూర్తి చేయాలని అన్నారు. గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణలో గతంలో రెండు సార్లు పొరపాట్లు జరిగాయని, వాటిని పునరావృతం కాకుండా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. గ్రూప్ 1 పరీక్షలు సజావుగా నిర్వహించే దిశగా కలెక్టర్ లను చీఫ్ కోఆర్డినేటింగ్ అధికారులుగా, అదనపు కలెక్టర్ లను అదనపు కోఆర్డినేటింగ్ అధికారులుగా నియమిస్తున్నామని ఆయన తెలిపారు. పరీక్ష కేంద్రాలలో సంబంధిత అభ్యర్థులకు సరిపడా అవసరమైన మేర వసతులు కల్పించాలని, ఫర్నిచర్ టాయిలెట్స్, త్రాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా అయ్యే విధంగా చూడాలని తెలిపారు. పరీక్షా కేంద్రంలోకి వచ్చే మహిళా, పురుష అభ్యర్థులను తనిఖీ చేయుటకు పోలీస్ శాఖ ద్వారా తగిన ఏర్పాట్లు చేయాలనీ,

తరువాయి 5లో



## గంజాయి మత్తులో యువత...

ప్రశ్నార్థకంలో యువకుల భవిష్యత్తు...

నిలువరించలేకపోతున్న పోలీసులు....



ప్రజాపక్షం/ముధోల్: యువకులు మంచి బాటలో నడిచి ఉజ్వల భవిష్యత్తును ఏర్పర్చుకోవాలని స్ఫూర్తి ప్రదాతల నోటిన పదే పదే వచ్చే మాటా.ప్రతి మనిషి జీవితంలో యువ వయస్సు దేనినైనా ఎదురించి పోరాట పటిమ ప్రదర్శించే ముఖ్య ఘట్టం,అది సమాజం కోసం,తన కుటుంబం కోసం,తన భవిష్యత్తు కోసం కావచ్చు.యువ వయస్సే భవిష్యత్ నిర్మాణానికి పునాది.సద్భావనలో నడిచే వారు ఉన్నతంగా దుర్భావనలో నడిచే వారు తమ జీవితాన్ని అదోగతిగా మార్చుకుంటారు.అయితే వీటికి భిన్నంగా ముధోల్,బాసర,చుట్టూ పక్కల ఉన్న ఆయా మండల యువకులు గంజాయిని సేవిస్తున్నారని తెలిసిన అది కంటికి కనబడిన అసత్యంగా మారింది.విచ్చల విడిగా యువకులు ఎక్కడ పడితే అక్కడ గంజాయి సేవిస్తు మత్తుకు బలవుతున్నారు.గంజాయి మత్తుకు బానిసైన వారు తిరిగి సాధారణ స్థితికి రావడం కష్టమేనని నిపుణులు చెప్పే స్పష్టమైన విషయం.అయితే మన ప్రాంత యువకుల వరకు గంజాయి ఏవిధంగా

తరువాయి 5లో

### స్ట్రాంగ్ రూమ్ లను తనిఖీ చేసిన
## రాష్ట్ర డిప్యూటీ ప్రధాన ఎన్నికల అధికారి



ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : ఈవిఎం యంత్రాలను భద్రపర్చిన స్ట్రాంగ్ రూమ్ లను రాష్ట్ర డిప్యూటీ ప్రధాన ఎన్నికల అధికారి మురళీ మోహన్ రావు పరిశీలించారు. శనివారం రాష్ట్ర డిప్యూటీ ప్రధాన ఎన్నికల అధికారి మురళీ మోహన్ రావు రామగిరిలోని సెంటినరీ కాలనీలో ఉన్న జేఎన్టీయూ మంథని కళాశాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ తో కలిసి తనిఖీ చేశారు. రాష్ట్ర డిప్యూటీ ప్రధాన ఎన్నికల అధికారి మురళీ మోహన్ రావు జేఎన్టీయూ మంథని కళాశాలలో రామగుండం ,మంథని , ధర్మపురి, పెద్దపల్లి అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించిన స్ట్రాంగ్ రూములకు వేసిన సీల్ లను పరిశీలించి సంబంధిత రిజిస్టర్ లో సంతకం చేశారు. అదే విధంగా జూన్ 4న జరగబోయే కౌంటింగ్ కి సంబంధించి చేస్తున్న ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, కెమెరా మానిటరింగ్ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ధర్మపురి, పెద్దపల్లి, రామగుండం, మంథని అసెంబ్లీ సెగ్మెంట్ల కౌంటింగ్ ప్రక్రియ జెఎన్టియు రామగిరి కళాశాలలో జరుగుతుందని, ఈ అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించి పోలైన ఈవీఎం యంత్రాలను స్ట్రాంగ్ రూమ్ లలో భద్రపర్చామని, స్ట్రాంగ్ రూమ్ ల వద్ద 3 అంచెల పటిష్ట భద్రత వ్యవస్థ ఏర్పాటు చేశామని, స్ట్రాంగ్ రూమ్ పూర్తి కవరేజీతో సిసి కేమేరాలు ఏర్పాటు చేశామని, వీటి ద్వారా స్ట్రాంగ్ రూమ్ లను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని అధికారులు వివరించారు. సహాయ రిటర్నింగ్ అధికారి వి.హనుమా నాయక్, తహసిల్దారులు, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

### గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను
## పకడ్బందీగా నిర్వహించాలి

అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారీ

ప్రజాపక్షం/ఆసిఫాబాద్ : జూన్ 9న జరుగబోయే గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్ష ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలని టిఎస్‌పిఎస్‌సి ఛైర్మన్ మహేందర్ రెడ్డి తెలిపారు. గ్రూప్1 ప్రిలిమినరీ పరీక్ష నేపథ్యంలో హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లు, ఎస్‌పి లతో టిఎస్‌పిఎస్‌సి ఛైర్మన్ మహేందర్ రెడ్డి ఇతర అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో అడిషనల్ కలెక్టర్లు దీపక్ తివారీ, దాసరి వేణు, జిల్లా ఎస్‌పి సురేష్ కుమార్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ జిల్లాలో వచ్చే నెల జూన్ 9న జరిగే గ్రూప్1 ప్రిలిమినరీ పరీక్షలకు పకడ్బంది ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో కాగజ్ నగర్ పట్టణంలో 7 కేంద్రాలు, ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో 6 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా 2783 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. కాగజ్ నగర్ పట్టణంలోని పరీక్షా కేంద్రాలలో 1512 మంది అభ్యర్థులు, ఆసిఫాబాద్ పట్టణం పరీక్షా కేంద్రాలలో 1271 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారని, పరీక్షా కేంద్రాలలో పరీక్ష జరిగే రోజు నిరంతర విద్యుత్తు, త్రాగునీరు, ఫర్నీచరు, అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు గంటన్నర ముందే చేరుకునేలా ఆర్‌టిసి బస్సులు నడిపేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ విధించనున్నట్లు చెప్పారు. పరీక్షా కేంద్రానికి మూడు కిలో మీటర్ల పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బందోబస్తు ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆసిఫాబాద్ డిఎస్‌పి సదయ్య, గ్రూప్1 నిర్వహణ ఆసిఫాబాద్ రీజినల్ సమన్వయ కర్త డి. లక్ష్మీ నర్సింహం, పాల్గొన్నారు.



# అంగరంగ వైభవంగా కన్యకా పరమేశ్వరి జన్మదిన ఉత్సవాలు

**ప్రజా పక్షం/కాగజ్ నగర్ :** కాగజ్ నగర్ పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి పంచాయతన క్షేత్రంలో శనివారం వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జన్మదినం సందర్భంగా కాగజ్ నగర్ పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పండితులు బాచంపల్లి కమలాకర్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమాలతో జన్మదినోత్సవమును అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా ఉదయం 5 గంటల 30 నిమిషముల నుండి శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మూలవిరాట్ అమ్మవారికి పంచామృత, పంచ పలరస, సుగంధ ద్రవ్య అభిషేకం, స్వర్ణ శాటికాలంకరణ, అష్టోత్తర కుంకుమ పూజనము, చండీ హోమమును నిర్వహించారు. అనంతరం మూలవిరాట్ శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి సుమారు 2 కేజీల బంగారు చీరను బహూకరించి అలంకరించారు. ఇలాంటి జన్మదినోత్సవ వేడుకలు, తెలంగాణలోనే మొట్టమొదటగా బంగారు చీరను బహూకరించిన ఘనత కాగజ్ నగర్ పట్టణ ఆర్యవైశ్య సోదరులకు దక్కింది. ఈ జన్మ లో దినోత్సవాలను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆర్యవైశ్య దాతల సహకారంతో బంగారు చీరను తయారు చేయించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షులు మైలారపు మురళీధర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు గణపురం శ్రీనివాస్, కాసం శ్రీనివాస్, పాలెపు మురళీధర్ పట్టణ ఆర్యవైశ్యులు, బంగారుచీరకు సహకరించిన దాతలు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.





**వాసవి మాతను దర్శించుకున్న శాసన సభ్యులు డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు**

పట్టణంలోని శ్రీ వాసవి మాత ఆలయంలో శనివారం వాసవి జయంతి సందర్భంగా అమ్మవారికి బంగారు వస్త్రాలంకరణ చేయడం జరిగింది. సిర్పూర్ శాసనసభ్యులు డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల ఆశీర్వచనం తీసుకున్నారు.

## విద్యార్థికి 5599 ర్యాంక్



**ప్రజాపక్షం/మెట్ పల్లి:** పట్టణానికి చెందిన పసునూరి రామ్ చరణ్, శనివారం విడుదలైనా ఎప్ సెంట్ 2024 పరీక్ష ఫలితాల్లో 5599 స్టేట్ ర్యాంక్ వచ్చింది. హైస్కూల్ నుండి ఇంటర్మీడియట్ వరకు ప్రభుత్వ పాఠశాలలో చదివి కూడా, తాజా ఎప్ సెంట్ అగ్రికల్చర్ అండ్ ఫార్మసి స్ట్రీమ్ విభాగంలో 77.5 మార్కులతో ఈ ర్యాంక్ సాధించినట్టు ఈ సందర్భంగా విద్యార్థి తల్లిదండ్రులు తెలిపారు.

## నర్సరీలను సందర్శించిన ఎంపిడిఓ



**ప్రజాపక్షం/సిర్పూర్ టి :** హరితహారంకు సంబంధించిన మొక్కలను సకాలంలో అందించే విధంగా చూడాలని, కేటాయించిన మొక్కల పెంపకంపై గ్రామ పంచాయితీ పరిధిలోని అధికారులు తగు చర్యలు తీసుకోవాలని సిర్పూర్ టి ఎంపిడిఓ సత్యనారాయణ అన్నారు. శనివారం సిర్పూర్ టి మండల కేంద్రంలోని చిలపెల్లి, మేడిపెల్లి గ్రామ పంచాయతీల నర్సరీలను ఆయన సందర్శించి పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ గ్రామ పంచాయితీలకు కేటాయించిన మొక్కలను 100 శాతం అందించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమములో పంచాయతీ కార్యదర్శులు సాయి కృష్ణ , రాహూల్, ఎఫ్ఎ. భీం రావ్ పాల్గొన్నారు.

## తడిసిన దాన్యాన్ని కొనుగోలు చేయాలి



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా గత నాలుగు, ఐదు రోజులుగా కురిసిన అకాల వర్షాలకు తడిసిన ధాన్యం తో రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రభుత్వం వారిని ఆదుకోవాలని తెలంగాణ ప్రజా ఫ్రంట్, పెద్దపల్లి జిల్లా కన్వీనర్ గుమ్మడి కొమురయ్య అన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చినట్లుగా దొడ్డ వడ్లు, సన్న రకాలుగా అని కాకుండా అన్ని వడ్లకు 500 రూపాయలు బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజా ఫ్రంట్, పెద్దపల్లి జిల్లా కో కన్వీనర్ మల్లేశం పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యాన్ని కోతలు లేకుండా కొనుగోలు చేయాలి



**ప్రజాపక్షం/ఇల్లందకుంట:** కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలంలో అకాల వర్షాలతో తడిసిన వరిధాన్యాన్ని బిజెపి మండల పార్టీ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతి రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు వరిధాన్యాన్ని ఎలాంటి ఆంక్షలు లేకుండా, కటింగ్ లేకుండా కొనుగోలు చేసి మద్దతు ధరకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను విస్మరించి రైతులను మోసం చేసిందని దుయ్యబట్టారు. వరిధాన్యం కొనుగోలుకు ముందు సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి సమీక్ష జరపాల్సిన సీఎం రేవంత్ రెడ్డి రైతుల గురించి పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. రైతుల పట్ల మొసలికన్నీరు కారుస్తూ సమీక్ష పేరిట రైతులను మభ్యపెట్టడానికి సీఎం ప్రయత్నిస్తున్నాడని, కానీ ఇప్పటికే 80 శాతం ధాన్యం కొనుగోలు పూర్తి కావడం జరిగిందని, వరిధాన్యం అమ్ముకున్న రైతులకు జరిగిన నష్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏ రకంగా పూరిస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు.వెంటనే తడిసిన వరి ధాన్యాన్ని ఎలాంటి ఆంక్షలు లేకుండా ప్రతి గింజను కొనుగోలు చేసి క్వింటాలు వరిధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆరెల్లి శ్రీనివాస్, ఉప్పుల రమేష్, కందాల రాజేందర్, మడ్డి శ్రీనివాస్, మురహరి గోపాల్, గొర్రె ఓదెలు, గరుకుంట్ల అనిల్, చింతల విజేందర్, ఉడుత ఐలయ్య, వలసని సునీల్, బండి రమేష్ తదితరులున్నారు.

## సెల్ ఫోన్ల అప్పగింత



**ప్రజాపక్షం/కాగజ్ నగర్ రూరల్ :** రాస్పల్లికి చెందిన గాజుల శ్రీకాంత్, ఆసిఫాబాద్‌కు చెందిన ముదస్సిర్ హుస్సేన్, నాగంపేటకు చెందిన రాకేష్‌లు ఫోన్లు పోగొట్టుకున్నారు. దీంతో ఈస్గాం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడంతో సిఇఐఆర్ యాప్ ద్వారా దర్యాప్తు చేపట్టిన పోలీసులు రికవరీ చేసిన సెల్ ఫోన్ లను శనివారం ఈస్గాం ఎస్ఐ రామన్ కుమార్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఈస్గాం ఎస్ఐ రామన్ కుమార్ మాట్లాడుతూ మొబైల్ పోయిన లేదా దొంగిలించబడిన త్వరగా స్పందించి సిఇఐఆర్ పోర్టల్ నందు ఫిర్యాదు నమోదు చేస్తే మొబైల్ ట్రేస్ కావడానికి ఎక్కువ అవకాశం ఉంటుందని అన్నారు. ఈ మొబైల్స్ ట్రేస్ చేయటంలో ప్రతిభ కనబర్చిన పోలీస్ కానిస్టేబుల్ నయాంను ఏఎస్ఐ హీరామన్, ఎస్ఐ రామన్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

## మే31లోగా విదేశీ విద్యానిధికి దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి:** 202425 సంవత్సరానికి పెద్దపల్లి జిల్లాలోని విదేశాల్లో చదివే గిరిజన విద్యార్థిని విద్యార్థులకు ఉపకార వేతనానికి మే 31లోగా దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి డి.జనార్దన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విదేశాల్లో మాస్టర్స్ స్థాయి పి.హెచ్. డి. పోస్ట్, డాక్టోరల్ రీసెర్చ్ ప్రోగ్రాం నందు చదవాలనుకునే గిరిజన విద్యార్థిని విద్యార్థులు ఈ పథకానికి అర్హులని అన్నారు. ఎంపికైన గిరిజన విద్యార్థినీ విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా ఉపకార వేతనాలు అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన అర్హులైన గిరిజన విద్యార్థిని విద్యార్థులు ఈనెల 31లోగా https://overseas.tribal.gov.in వెబ్ సైట్ లో దరఖాస్తు చేసుకుని,ఈఅవకాశాన్ని సద్వినియోగము చేసుకోవాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఆ ప్రకటనలో కోరారు.

## వేసవి క్రీడా శిక్షణ శిబిరానికి చెస్ బోర్డ్స్ అందజేత



**ప్రజాపక్షం/తిర్యాని:** గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడ శిక్షణ శిబిరానికి తిర్యాని మండలంలోని చింతపల్లి గ్రామానికి చెందిన మేంద్రపు రవీందర్ చెస్ బోర్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి కుష్బూ గుప్తా రవీందర్ ను ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. అనంతరం రవీందర్ మాట్లాడుతూ తను ఒక గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుకోవడం జరిగిందన్నారు. అలాగే ప్రస్తుతం సిఆర్టీ పిడి గా విధులు నిర్వహిస్తున్నానని తెలిపారు. తన వంతుగా తమ గిరిజన విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో మా గురువు గిరిజన క్రీడల అధికారి బండ మీనారెడ్డి సూచన మేరకు గిరిజన విద్యార్థినీ విద్యార్థుల కోసం తన సొంత ఖర్చులతో చెస్ బోర్డులు అందజేయడం జరిగినదన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ అర్. రమాదేవి ఎటిడిఒలు క్షేత్రయ్య, పురుషోత్తం, కమర్ హుస్సేన్, ఎసిఎంఒ ఉద్ధవ్, జిసిడిఒ శకుంతల, ఆసిఫాబాద్, మంచిర్యాల గిరిజన క్రీడల అధికారులు బండ మీనా రెడ్డి, బండ జీవరత్నం, క్రీడా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్. కృష్ణారావు, పిఇటిలు గుండం లక్ష్మణ్, పెందూరు మంగవతి, శ్రీనివాస్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం భీమ్ రాజ్‌పల్లి గ్రామంలో(బిబికే) భీమ్ రాజ్‌పల్లి బొమ్మన కుమార్ క్రికెట్ టోర్నమెంట్ స్వర్గీయ కంది లక్ష్మి నర్సమ్మ నారాయణ, బొమ్మెన వెంకమ్మ బుచ్చయ్యల జ్ఞాపకార్థంగా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు బొమ్మెన కుమార్, గ్రామ మాజీ సర్పంచ్ రేవెల్ల సత్యనారాయణ గౌడ్, లింగయ్య, స్వామి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సమ్మర్ క్రీడా శిక్షణ శిబిరానికి కిట్లు పంపిణీ




**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** సమ్మర్ క్రీడా శిక్షణ శిబిరానికి కిట్లు ఐటిడిఎ పిఒ కుష్బూ గుప్తా పంపిణీ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని గిరిజన క్రీడా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 16 నుండి 31 వరకు నిర్వహిస్తున్న సమ్మర్ స్పోర్ట్స్ క్యాంప్ లో పాల్గొనే క్రీడాకారులకు దుస్తులు,షూస్ లు అందజేశారు. క్రీడాకారులకు పలు సూచనలు సలహాలు చేశారు. క్రీడలు ఆడడంతో మానసిక ఉల్లాసం పెరుగుతోందని పేర్కొన్నారు. అనంతరం క్రీడాకారులతో చెస్ ఆడి క్రీడ పాఠశాల మైదానంను పరిశీలించారు. పాఠశాల ప్రారంభం వరకు క్రీడా పాఠశాలకు కావలసిన అన్ని సౌకర్యాలు సమకూర్చాలని గిరిజన శాఖ అధికారి నిరంజన్ కు పలు సూచనలు చేశారు. 202324 సంవత్సరంలో కొమరం భీమ్, మంచిర్యాల జిల్లాలో ఆశ్రమ పాఠశాలలో చదువుతూ క్రీడల్లో అత్యంత ప్రతిభ కనపరిచిన 60 మంది బాలురను, 60 మంది బాలికలను ఇప్పటికే ఎంపిక చేసామని గిరిజన క్రీడల అధికారి బండ మీనారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ అర్. రమాదేవి, ఎసిఎంవో ఉద్ధవ్, ఎటిడిఒ క్షేత్రయ్య, జైనూర్ ఎటిడిఒ పురుషోత్తం, కాగజ్ నగర్ ఎటిడిఒ కమర్ హుస్సేన్, జిసిడిఓ శకుంతల, మంచిర్యాల క్రీడల అధికారి బండ జీవరత్నం, క్రీడా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్. కృష్ణారావు, హెచ్ డబ్ల్యుఒ శ్రీనివాస్, విజయశాంతి, శిక్షకులు విద్యాసాగర్ అరవింద్, తిరుమల్, పిఇటి లు లక్ష్మణ్, మంగవతి, శ్రీనివాస్, సుభాష్, రవీందర్, సుమలత, బాక్సింగ్ సెక్రెటరీ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## శారీరక, మానసిక దృఢత్వానికి యోగా నేర్చుకోవాలి



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ ప్రతినిధి :** గోలేటి సింగరేణి పాఠశాల ఆవరణలో యువజన క్రీడా శాఖ కొమరం భీమ్ జిల్లా ఆధ్వర్యంలో యోగా కోచ్ కేసరి అలేఖ్య శిక్షణలో ఉచిత సమ్మర్ యోగా క్యాంప్ సాయంకాలం 5:30 నిమిషాల నుండి 6:30 వరకు మే 31 వరకు కొనసాగుతుందని, ఆసక్తిగల విద్యార్థులు సెలవులను వృధా చేసుకోకుండా శారీరక మానసిక దృఢత్వానికి నైపుణ్యాలను పెంచుకోవడానికి యోగ శిక్షణలో పాల్గొనాలని కొమరం భీమ్ యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కేసరి ఆంజనేయులు గౌడ్, జనరల్ సెక్రెటరీ కొలిపాక కిరణ్. ఉపాధ్యక్షులు పిఇటి భాస్కర్, కోశాధికారి జగన్నాథ్, ఓదెలు తెలిపారు.

# తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి



**ప్రజాపక్షం/చిగురుమామిడి:** బిజెపి చిగురుమామిడి మండల అధ్యక్షుడు పైడిపల్లి శ్రీనివాస్ ఆద్వర్యంలో మండలంలోని ఇందుర్తి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం సందర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి హాజరై మాట్లాడారు. అకాల వర్షం కారణంగా కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం పూర్తిగా తడిసిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేయకపోవడంతో వర్షాలకు తడిసిందని, చేతికి అందిన పంట నీటిపాలయ్యిందని వాపోయారు. కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం వెంటనే కొనుగోలు చేసి నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. వరిధాన్యం క్వింటాలకు రూ.500 బోనస్ అందించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలు పరిష్కరించకపోతే బిజెపి ఆద్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి పొన్నం శ్రీనివాస్, మండల కార్యదర్శి బుర్ర శ్రీనివాస్, కంటె శ్రీనివాస్, ఓబిసి మోర్చా మండల అధ్యక్షుడు గుల్ల కిష్టయ్య, నాయకులు కొంకటి లక్ష్మణ్, కూన పోచయ్య, రాంరెడ్డి, బిమర లక్ష్మణ్, బూత్ అధ్యక్షుడు బుర్ర సతీష్, తులాల వెంకటేశ్వర్లు, ఎన్నము సంతోష్, కొంకటి లక్ష్మి, సాయి, కిరణ్, సాత్విక్, పోతరవేని శ్రీనివాస్, రాకేష్‌లున్నారు.

## మున్సిపల్ సిబ్బందికి చీరల పంపిణీ



**ప్రజాపక్షం /సుల్తానాబాద్ :** వాసవి వనిత క్వీన్స్ క్లబ్ డిస్టిక్ 107 ఏ రీజియన్ టు క్లబ్ ఆధ్వర్యంలో శనివారం సుల్తానాబాద్ పట్టణంలోని వాసవి మాత గుడిలో అమ్మవారికి ఓడి బియ్యం మరియు కుంకుమ పూజ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఆదేశాల మేరకు నవరత్న సేవలలో ఒకటి వాసవి మాత జయంతి సందర్భంగా మున్సిపాలిటీ సిబ్బందికి చీరలు పంపిణీ చేయడం జరిగింది, ఈ కార్యక్రమానికి రీజియన్ చైర్ పర్సన్ అల్లంకి లింగ మూర్తి, రీజియన్ సెక్రెటరీ బాదం వాని, జోన్ చైర్ పర్సన్ యాంసాని రమాదేవి, వాసవి వనిత క్వీన్స్ క్లబ్ ప్రెసిడెంట్ జైశెట్టి సుమ, సెక్రటరీ కొమురవెల్లి అరుణ, ట్రెజరర్ తొడుపునూరి కవిత, వాసవి క్లబ్ సెక్రటరీ పుల్లూరి రమేష్,క్లబ్ సభ్యులు, ఆర్యవైశ్య సంఘం సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

## ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో నీటి సమస్య తీరుస్తాం



**ప్రజాపక్షం/మంథని:** నీటి సమస్య ఏర్పడిన ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసి సమస్య తీరుస్తామని మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రి రమా సురేష్‌రెడ్డి తెలిపారు. మంథని మున్సిపల్ పరిధిలోని 11వ వార్డు మర్రివాడలో నీటి సమస్య తీర్చేలా బోర్‌మోటార్‌కు మరమ్మత్తులు చేయించి ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని ఆయా వార్డుల్లో సమస్యలను తెలుసుకోవడం జరుగుతుందని, ప్రస్తుత పరిస్థితుల్లో తాగునీటి సమస్యపై దృష్టిసారించినట్లు తెలిపారు. ప్రతి వార్డుల్లో సమస్య ఉత్పన్నమైతే ఆ ప్రాంతంలోని బోర్‌మోటార్‌లను వినియోగంలోకి తీసుకువస్తున్నామని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలని ఆమె కోరారు. తమ సమస్యను విన్నవించిన వెంటనే స్పందించి బోర్‌మోటార్‌కు మరమ్మత్తులు చేయించిన మున్సిపల్ చైర్ పర్సన్‌కు వీధివాసులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సీపతి బానయ్య, వార్డు కౌన్సిలర్ వీకే రవితోపాటు తదితరులుతదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి




**ప్రజాపక్షం/కాగజ్ నగర్ రూరల్ :** స్పర్శ ఫౌండేషన్, సిర్పూర్ పేపర్ మిల్లు ఆధ్వర్యంలో మారుమూల గ్రామాల ప్రజలకు అందిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సిర్పూర్ పేపర్ మిల్లు చీఫ్ మేనేజర్ రమేష్ రావు అన్నారు. శనివారం కాగజ్ నగర్ మండలం లోని కొత్తసార్సల గ్రామంలో స్పర్శ ఫౌండేషన్, సిర్పూర్ పేపర్ మిల్లు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ బాను ప్రకాష్, పేపర్ మిల్లు వైద్య సిబ్బంది గ్రామంలోని ప్రజలకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్పర్శ ఫౌండేషన్ మేనేజర్ రీణ బివాల్, మిల్లు ప్రతినిధి తుమ్మ రమేష్, నాగేశ్వరరావు శివ కుమార్ గ్రామ యువత పుల్లా అశోక్, పుల్లా శ్రీకాంత్ కార్యదర్శి మహేష్, సురేందర్, మిల్లు హాస్పిటల్ సిబ్బంది సిస్టర్ రేఖా, శ్రీవాణి విజయ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అమ్మ ఆదర్శ పనులను వేగవంతం చేయాలి..



**ప్రజాపక్షం/కుంటాలః** అమ్మ ఆదర్శ పాఠశాలలో పనులను వేగవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ అన్నారు. శనివారం వెంకూర్, అందాకూర్, విట్టాపూర్ గ్రామాలలో పల్లె ప్రకృతి వనం, సిగ్రిగేషన్ షెడ్, నర్సరీలు, డ్రైన్స్ పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో త్రాగునీటి సౌకర్యం, ఎలక్ట్రిసిటీ, టాయిలెట్స్, బెంచీలు, బ్లాక్ చాక్ బోర్డు, మిగిలిన మరమ్మత్తులను చేపట్టవలసిన పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. పనులకు సంబంధించిన రికార్డులను పకడ్బందీగా నమోదు చేయాలని ఆదేశించారు. పాఠశాలల్లో జరుగుతున్న మౌలిక వసతుల కల్పన కోసం జరుగుతుతన్న పనులపై సంబంధిత అధికారు పర్యవేక్షణ తప్పనిసరి ఉండాలన్నారు. అనంతరం గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఆర్డబ్ల్యూఎస్ సురేష్, ఏపీవో గట్టుపల్లి నవీన్, కార్యదర్శులు, తదితరులు ఉన్నారు.

## ఉద్యోగ,ఉపాధ్యాయుల సమస్యలపై జెడ్పి సీఈఓకు వినతి




**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:** నిర్మల్ జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి గోవింద్(సీఈఓ) ను పి.ఆర్.టి.యు తెలంగాణ జిల్లా అధ్యక్షులు యాటకారి సాయన్న ఆధ్వర్యంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చనిచ్చారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల జి.పి. ఎఫ్ పార్ట్ ఫైనల్, లోన్లు తక్షణమే నిధులు విడుదల చేయాలని మీ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లున్నాం. చాలా కాలం క్రితమే మీకు దరఖాస్తు చేసుకోవడం జరిగింది.తాము పిల్లల చదువులు, పెళ్లిళ్లు, గృహ నిర్మాణ, తదితర అవసరాల కొరకు దాచుకున్న డబ్బులు సకాలంలో రాక తీవ్ర నిరాశకు గురవుతున్నారు. వీటిపై తక్షణమే స్పందించి నిధులు ఇప్పించాలని కోరారు.అదే విధంగా మిస్సింగులు వారి వారి ఖాతాల్లోకి సకాలంలో జమ అయ్యేటట్లు చూడాలని పి.ఆర్.టి.యు తెలంగాణ నిర్మల్ జిల్లా శాఖ ప్రాతినిధ్యం చేయడం జరిగింది. సీఈఓ సానుకూలంగా స్పందిస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వోడ్నాల రవి రాజ్,జిల్లా నాయకులు చక్రాల హరిప్రసాద్, గంగాధర్, వోజ్జల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాకు చేరుకున్న ఏకరూప దుస్తుల వస్త్రం



**ప్రజాపక్షం/నిర్మల్‌రూరల్‌:** ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలలో చదివే విద్యార్థులకు అందించే ఏకరూప దుస్తులకు సంబంధించిన మొదటి విడత వస్త్రం శనివారం రోజు జిల్లాకు చేరిందని జిల్లా విద్యాశాఖధికారి డా.ఏ.రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.తెలంగాణ చేనేత వస్త్ర పరిశ్రమల శాఖ నుండి మొదటి విడత గా ఒక జత ఏక రూప దుస్తుల కోసం 150 బెయిల్ల తో కూడిన ఏకరూప వస్త్రం జిల్లాకు చేరింది.దీనిని సోఫీనగర్ లోని గురుకుల పాఠశాలలో భద్రపరచడం జరిగింది.ఇందులో 3 రకాల వస్త్రం మాత్రమే వచ్చింది.ఇంకా 2 రకాల వస్త్రం రావాల్సి ఉంది. ఒక జత ఏక రూప దుస్తులను జున్ 5 లొపు కుట్టించి, ఆయా పాఠశాలలకు అందిస్తామని వారు తెలిపారు. జున్ 12న పాఠశాలల ప్రారంభం లోపు అందరు విద్యార్థులకు కొత్త ఏకరూప దుస్తులు తప్పకుండా అందేలా చూడాలని స్వయం సహాయక సంఘ సభలకు తెలిపారు.

## వర్షం ధాటికి కూలిన గోడ



**ప్రజాపక్షం/ముత్తారం:** ముత్తారం మండలం లోని ఓడేడు గ్రామంలో బీరవెల్లి రవీందర్ గుప్తాకు చెందిన ఇంటి ప్రహరీ గోడ పై తాటి మొద్దు(చెట్టు )వర్షం ధాటికి ఒకేసారి కుప్పకూలి ప్రహరీ గోడపై పడిపోవడంతో గోడ శనివారం కూలింది. ఈ గోడ కూలిన సమయంలో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో బాధితుడు రవీందర్ ఊపిరి పీల్చుకున్నాడు. గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇంటి ప్రహరి గోడ తడిసి కూలిపోయింది. కాగా ప్రభుత్వ పరంగా ఆర్థిక సాయం అందించాలని బాధితులు రవీందర్ కోరుతున్నారు.

## అంగరంగ వైభవంగా వాసవి మాత జయంతి... వార్షికోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం /సుల్తానాబాద్ :** సుల్తానాబాద్ పట్టణంలోని ఆర్యవైశ్య భవన్ ఆవరణలో గల వాసవి మాత దేవాలయంలో శనివారం వాసవి మాత జయంతి.వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా కన్నుల పండువ గా జరిగాయి.ఉదయం గణేష్ పూజలతో వేడుకలు ప్రారంభమయ్యాయి... అనంతరం అమ్మవారికి అభిషేకం.. అంతకు ముందు పెద్ద ఎత్తున హోమాలు.. కుంకుమ పూజలు జరిగాయి.సాయంత్రం అమ్మవారి శోభాయాత్ర వేడుకలు ఘనంగా జరిగాయి.అమ్మవారి ఊరేగింపు వాసవి మాత దేవాలయం నుండి పోలీస్ స్టేషన్ మీదుగా వేణుగోపాలస్వామి దేవాలయం నుండి వాసవి మాత దేవాలయం వరకు శోభయాత్ర జరిగింది. పూజారులు చంద్రశేఖర్ శర్మ, సంతోష్ శర్మ పలువురు పూజారులు పాల్గొని అమ్మవారి జయంతి, వార్షికోత్సవ వేడుకలను ఘనంగా జరిపించారు, అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వాహనాలను నడిపిన మహిళలను సన్మానించిన పల్లకిషన్



**ప్రజాపక్షం /సుల్తానాబాద్ :** సుల్తానాబాద్ పట్టణంలోని ఆర్యవైశ్య భవన్ ఆవరణలో వాసవి మాత జయంతి వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకొని,శనివారం మాజీ లోక్ దాలత్ సభ్యుతు, సామాజిక సేవకులు పల్లకిషన్ రాజమణి దంపతులు ద్విచక్ర వాహనాలను నడిపిన మహిళలను గుర్తించి దాదాపు 20 మంది మహిళలకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ద్విచక్ర వాహనాలను నడిపిన మహిళలను గుర్తించి పల్లకిషన్ సన్మానించడం ఎంతో సంతోషంగా ఉందని ఆర్యవైశ్య సంఘం నాయకులు కిషన్ రాజమణి దంపతులను సన్మానించి, అభినందించారు.

## శివాలయంలో ఘనంగా వాసవి మాత జయంతి వేడుకలు



**ప్రజాపక్షం /సుల్తానాబాద్ :** సుల్తానాబాద్ పట్టణంలోని పాతవాడలో గల శివాలయంలో శనివారం వాసవి మాత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శివాలయం చైర్మన్ అల్లంకి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పూజారులు మహేష్, రమేష్ లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# రైతుల కన్నీటికి కారణం కాంగ్రెస్



**ప్రజాపక్షం/గంగాధర:** బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో గంగాధర మండంలోని కొండాయపల్లి, చెర్లపల్లి (ఎన్) గ్రామాలలో వడ్లు కొనుగోలు కేంద్రాలను శనివారం సందర్శించారు. ఈ సంధర్బంగా బిజెపి పార్టీ మండల అధ్యక్షులు కోల అశోక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల కొనుగోళ్లు ఆలస్యం అవుతున్నాయని, కేంద్రాలలో పోసిన వడ్లు అకాల వర్షంతో తడిసి రైతులు నష్టపోతున్నారని అన్నారు. సెంటర్‌లో వడ్లు పోసి నెలలు గడుస్తున్నా కొనడం లేదని, ఆరుగాలం కష్టపడి పండించిన పంట వర్షానికి తడిసిందని రైతులు ఆవేదన చెందుతున్నారన్నారు. తడిసిన ధాన్యాన్ని తరుగు లేకుండా ప్రభుత్వం వెంటనే కొనుగోలు పూర్తి చేయాలని, అలాగా రూ.500 బోనస్‌తో కలిపి రైతులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీపతి చంద్రశేఖర్, ఎస్సీ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి మల్యాల వినయ్ సాగర్, బిజెపి జిల్లా నాయకులు ఎట్టెపు కనుకయ్య, మండల ఉపాధ్యక్షులు బొమ్మకంటి రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రేండ్ల శ్రీనివాస్ , దళిత మోర్చా మండల అధ్యక్షుడు తాళ్ల రాజశేఖర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఐటిఐలో ప్రదేశం కోసం దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:** రాజీవ్ గాంధీ ఐటిఐ కాలేజీలో పలుకోర్సులలో ప్రవేశం కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కృష్ణ మూర్తి తెలిపారు.పది పూర్తయిన వారు ఐటిఐ, telangana.gov.in ఎలక్ట్రిషియన్80,ఫిట్టర్ 20,రిఫ్రిజిరేషన్,ఏసి కోర్సులో 24,వెల్డర్ 40,డీసిల్ మెకానిక్ 48,కంప్యూటర్ ఆపరేటర్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ 48,డ్రెస్ మేకింగ్ 40,సీట్లను ఆన్లైన్లో జున్ 10లోగా దరఖాస్తు చేసుకోవలన్నారు.

## పేకాట ఆడుతున్న ఏడుగురు అరెస్ట్

**ప్రజాపక్షం/సారంగాపూర్:** మండలంలోని బీరవెల్లి గ్రామంలో పేకాట స్థావరంపై ఎస్సై చంద్రమోహన్ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం దాడులు చేపట్టారు. గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఏడుగురుని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.31వేల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.మండలంలో పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## కేజీబీవీలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:** నిర్మల్ జిల్లాలోని కేజీబీవీ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం తెలుగు, ఇంగ్లీషు మీడియంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంపీహెచ్ డబ్లూ కోర్సుల్లో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెక్టోరియల్ అధికారులు తెలిపారు. ఒక్కో గ్రూపులో 40 సీట్ల చొప్పున ఖాళీలు ఉన్నాయని ఈ నెల 31లోగా అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో పూజలు

**ప్రజాపక్షం/మంథని:** శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి సమారాధన ఉత్సవాల్లో బాగంగా శనివారం మంథని పట్టణంలోని శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో మున్సిపల్ చైర్ పర్సన్ పెంద్రి రమాసురేష్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మొట్టమొదటి సారి ఆలయానికి వచ్చిన మున్సిపల్ చైర్ పర్సన్ పెంద్రి రమాసురేష్‌రెడ్డికి ఆలయ నిర్వాహ కమిటి సభ్యులు సన్మానం చేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి ఇనుముల సతీష్, మున్సిపల్ వైస్ చైర్మన్ సీపతి బానయ్య, వార్డు కౌన్సిలర్ వీకే రవి, చొప్పకట్ల హన్మంతరావు, నాయకులు కొట్టే రమేష్, నక్క శంకర్, పాపారావుతో పాటు ఆలయ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

## అన్నదాతలు ఆందోళన చెందవద్దు



**ప్రజాపక్షం/చిగురుమామిడి:** గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పంట నష్టపోయిన రైతులు ఆందోళన చెందవద్దని , ప్రభుత్వం అండగా ఉంటుందుని డిసిసి అధికార ప్రతినిధి దాసరి ప్రవీణ్ కుమార్ నేత తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరా తీసినట్లు తెలిపారు. తడిసిన ధాన్యాన్ని ఎటువంటి తాలు లేకుండా కొనుగోలు చేయాలంటూ కలెక్టర్‌కు మంత్రి పొన్నం ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. రైతులు ఎక్కడ నష్టపోకుండా ధాన్యం కొనుగోలు వేగవంతం అవుతుందన్నారు. మంత్రి పొన్నం అమెరికా పర్యటన ఉన్నప్పటికీ ఇక్కడ పడుతున్న వర్షాలతో ప్రజలకు జరిగిన నష్టంపై ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అధికారులను అప్రమత్తం చేస్తున్నారని తెలిపారు. రైతులెవరూ అధైర్యపడవద్దని, ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే ఆ సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, ఆందోళన చెందవద్దని భరోసా కల్పించారు.

## మృతుల కుటుంబాలను ఆదుకుంటాం



**ప్రజాపక్షం/బుగ్గారం:** జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం గోపాలపూర్ గ్రామానికి చెందిన దీటి శ్రీనివాస్, దీటి మహేష్‌లు మృతిచెందగా వారి కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ భరోసా ఇచ్చారు. మృతి చెందిన విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శనివారం శ్రీనివాస్, మహేష్‌ల పార్థీవ దేహాలకు నివాళి అర్పించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్, మహేష్ కుటుంబాలకు చెరో పది వేల చొప్పున ఇద్దరి కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేశారు. భవిష్యత్తులో సహాయం అందజేస్తామని లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారు. విప్ వెంట బుగ్గారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేముల సుభాష్, నాయకులు నర్సాగౌడ్, బీర్‌పూర్ తిరుపతి, మదన్, సంతోష్ తదితర నాయకులు ఉన్నారు.

## ఈ నెల 20న బీడీ యజమానులతో చర్చలకు పిలుపు



**ప్రజాపక్షం / కోరుట్ల :** తెలంగాణ రాష్ట్రంలోని బీడీ పరిశ్రమలలో పని చేస్తున్న కమిషన్ రేటు పెంపు కొరకై ఈ నెల 20న నిజామాబాద్ లో చర్చలకు ఆహ్వానించారని, ఏఐటియూసి రాష్ట్ర నాయకుడు సుతారి రాములు తెలిపారు. వివిధ నమూనా బీడి పరిశ్రమలలో పని చేసే మార్చి నెలతో రెండేళ్ల క్రితం చేసుకున్న ఒప్పందం గడువు ముగిసినందున కమిషన్ రేట్ తిరిగి పెంచాలని డిమాండ్ నోటీస్ బీడీ యజమానులకు ఇవ్వడంతో స్పందించిన బీడీ యజమానుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జితేంద్ర భాయ్ పటేల్, కార్యదర్శి ధర్మేంద్ర గాంధీ చర్చలకు సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. లేబర్ లైసెన్స్‌లు ఇంటి అద్దెలు మున్సిపల్ టాక్సీలు, బీడీ యజమానులే ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా వెంటనే జీవన భృతిని ఆసరా పెన్షన్ 4వేలు పెంచాలని కోరారు. ఈ సమావేశంలో దేశాయి బీడి, టెలిఫోన్ బీడీ, శివాజీ బీడీ, చార్ భాయ్ బీడీ, థిస్ నెంబర్ వీడీ భరత్ బీడీ, మయూర్ బీడీ, గౌతం బీడీ, జెమిని బీడీ, రవి, సత్తయ్య, నర్సయ్య, మల్లేశం, ప్రశాంత్, భూమయ్య తదితరులు పాల్గొన్నరు.

## కల్లాల్లోనే మొలకెత్తిన ధాన్యం



**ప్రజాపక్షం/చందుర్తి :** వరి ధాన్యం కోతలు కోసి రెండు నెలలు గడుస్తున్న ధాన్యం కొనుగోలు పూర్తి అవ్వకపోవడంతో ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల ధాన్యం తడిసి మొలకెత్తితోందని చందుర్తి మండల బిజెపి నాయకులు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని వరి ధాన్యం కల్లాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, కాంగ్రెస్ అసమర్థ పాలనకు మొలకెత్తిన ధాన్యమే నిదర్శనమని అన్నారు. మరికొద్ది రోజులలో తదుపరి పంట వేయడానికి సిద్ధమవుతున్న ధాన్యం కొనుగోలు పూర్తి కాకపోవడంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి తడిసిన ధాన్యంతో పాటు మిగతా ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, లేనియెడల రైతుల తరపున ఉద్యమిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ మార్త సత్తయ్య, జిల్లా ఉపాధ్యక్షులు సిరికొండ శ్రీనివాస్, మండల అధ్యక్షుడు పోంచెట్టి రాకేష్, మండల ప్రధాన కార్యదర్శి చిర్రం తిరుపతి, నాయకులు మోత్కుపల్లి మహేందర్, రైతులు పాల్గొన్నారు.

## శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి జయంతి ఉత్సవాలు



**ప్రజాపక్షం/కొత్తపల్లి:** కొత్తపల్లి మండలం చింతకుంట గ్రామంలో శ్రీ వాసవి ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్ సాయిబాబా టెంపుల్ వద్ద వైశ్యుల ఆరాధ్యదైవం శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్బంగా అమ్మవారికి పల పంచామృతాభిషేకంతో జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు, ఆర్యవైశ్యులు కుటంబ సమేతంగా పాల్గొని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు గుండా ప్రభాకర్, కంకణాల అనిల్ కుమార్, పడకంటి శ్రీనివాస్, తాటిపల్లి వేణుగోపాల్, భూపతి శ్రీనివాస్, చకినం మహేష్, గట్టు మహేష్, సంతోష్, లక్ష్మయ్య, దొంతుల సంతోష్‌లు పాల్గొన్నారు.

## అయ్యప్పస్వామి దేవాలయంలో ఉత్తరా నక్షత్ర పూజాభిషేకాలు



**ప్రజాపక్షం/జమ్మికుంట:** కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో అయ్యప్ప దేవాలయంలో ఉత్తర నక్షత్ర పూజా కార్యక్రమం లక్ష్మి గణపతి హోమం నిర్వహించారు. అదే విధంగా ప్రతి బుధ శనివారాల్లో నిత్య లక్ష్మి గణపతి హోమం నిర్వహించారు. ప్రతి సంవత్సరానికి దేవాలయంలో 108 లక్ష్మీ గణపతి హోమాలు నిర్వహించడం ఈ దేవాలయం ప్రత్యేకత కాగా శనివారం లక్ష్మి గణపతి హోమం ఉత్తరా నక్షత్ర పూజతో పాటు స్వామివారికి నవ విధ అభిషేకాలు, విశేష అలంకరణ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ సిరిమిల్ల జయేందర్, ఒల్లాల జగదీశ్వర్, పంతాటి రవీందర్, ఏబిసి రమేష్, దాసరి సదానందం, చాకినపల్లి తిరుపతి, యామిని వెంకట్‌రెడ్డి, పాల్గొన్నారు.

## ఘనంగా వాసవి పరమేశ్వరీ జయంతి వేడుకలు



**ప్రజాపక్షం/మల్లాపూర్ :** ఆర్యవైశ్యుల కుల దైవంగా కొలిచే వాసవి కన్యక పరమేశ్వరీ అమ్మవారి జయంతి ఉత్సవాలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని వాసవి కన్యక పరమేశ్వరీ ఆలయంలో అర్చకులు సాయి కిషోర్‌చే అమ్మవారికి మహిళలు కుంకుమ పూజలు అభిషేక అర్చనలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి శివ, సభ్యులు లక్ష్మి నారాయణ, ఆంజనేయులు, మనోహర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, భూమయ్య, అశ్విన్, మండల, ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు.

## ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న పాత్రికేయలను బెదిరించడం చాలా దారుణం



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:** ఓ ప్రధాన పత్రిక రిపోర్టర్ లక్ష్మి నారాయనకు బెదిరించిన వ్యక్తి పై కఠిన చర్యలు తీసుకోవాలని నిర్మల్ జిల్లా బీసీ సంక్షేమ సంఘము అధ్యక్షులు ఎంబడి. చంద్రశేఖర్ అన్నారు. శనివారం ఆయన ఒక పత్రిక ప్రకటన విడుదల చేస్తూ ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న పత్రికేయులనే బెదిరింపులకు గురిచేయడం చాలా దారుణం అని ఆయన అన్నారు. లక్ష్మి నారాయణ నిజాయితీగా వార్తలు వ్రాస్తుంటే అవి చూసి తట్టుకోలేక ఇటువంటి బెదిరింపులు చెయ్యడం సరైన పద్ధతి కాదని అన్నారు. ఈ విషయం పై శనివారం ఆయన సారంగపూర్ ఎస్.ఐ తో ఫోన్ ద్వారా మాట్లాడి బెదిరింపులకు గురిచేసిన వ్యక్తి పై ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేసి కఠినంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## జూన్ 9న గ్రూప్1ప్రిలిమినరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

(మొదటిపేజీ తరువాయి)

పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు చేయాలని తెలిపారు.పరీక్షా కేంద్రానికి అభ్యర్థులు ఒక రోజూ ముందుగా వెళ్లి పరీక్షా కేంద్రాన్ని ధృవీకరించుకోవాలని, బయో మెట్రిక్ హాజరు నమోదు దృష్ట్యా 900 గంటల నుండి పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉంటుందని,అభ్యర్థులు రెండు గంటల ముందుగా వచ్చే విధంగా చూసుకోవాలని, ఎట్టి పరిస్థతుల్లో 1000 తర్వాత పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉండదని, అభ్యర్థులు తమ అడ్మిట్ కార్డు తో పాటు గుర్తింపు కార్డు, బ్లూ/బ్లాక్ పాయింట్ పెన్ తీసుకొని రావాలని తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, పరీక్ష నిర్వహణకు సంబంధించి ప్రశ్నపత్రాల తరలింపు పోలీసుల పర్యవేక్షణలో జరగాలని, ప్రతి అంశం సీసీ కెమెరాలు రికార్డు అయ్యే విధంగా చూడాలని అధికారులకు ఆయన సూచించారు. పరీక్ష కేంద్రాలకు ప్రశ్న పత్రాల తరలింపు సమయంలో పోలీస్ బందోబస్తు ఉండాలని, ప్రశ్న పత్రాల, ఓఎంఆర్ షిట్ లో భద్రతకు స్ట్రాంగ్ రూంలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అభ్యర్థుల బయోమెట్రిక్ అటెండెన్స్ తీసుకునేందుకు వీలుగా అవసరమైన మేర రిజిస్ట్రేషన్ కౌంటర్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ, జిల్లాలో 4699 మంది అభ్యర్థుల కోసం 15 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశామని, సి.సి. కెమెరాల ఏర్పాటుతో పాటు, పరీక్ష సజావుగా నిర్వహించేందుకు లైజన్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్ లను ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించి, బయోమెట్రిక్ యంత్రాలు 1 రోజు ముందు జిల్లాకు వస్తే పరీక్షించి ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరీక్షలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.

## గంజాయి మత్తులో యువత...

(మొదటిపేజీ తరువాయి)

చేరుతున్న విషయం సందేహంగానే ఉన్న అది పోలీసులు కనిపెట్టడం కష్టమేమి కాదనేది జగమెరిగిన సత్యం గంజాయి సరఫరా నిలువరించడంలో పోలీసులు విఫలమయ్యారని పలువురు.ఆరోపిస్తున్నారు.మన ప్రాంత యువకులకు పక్క రాష్ట్రమైన మహారాష్ట్రలోని ధర్మాబాద్ అడ్డాగా మారిందనడానికి గతంలో బాసర ట్రిపుల్ ఐటిలో కలకలం రేపిన గంజాయి విషయమే సంకేతం.కొందరు యువకులు నేరుగా ధర్మాబాద్ నుండి తీసుకురాగా మరి కొందరికి స్థానికంగానే కొందరి ద్వారా లభిస్తున్నదనేది లోపాయుక్త విషయమే.ఏది ఏమైనా పోలీసులు ఇట్టి విషయంపై ఉక్కుపాదం మోపి నిలువరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పెద్దలు కోరుతున్నారు. గంజాయి బారిన పడకుండా యువకులకు పోలీసులు మరింత అవగాహనా కల్పించాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. గంజాయిని నిలువరించకనట్లయింతే యువకుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారడం ఖాయం.సమాజ నిర్మాణం కోసమో,ఉజ్వల భవిషత్తు కోసమో అదే విధంగా ఇతరులకు ఆదర్శంగా నిలిచేలా తమ యువ జీవితం ఉండాలి తప్ప మత్తులో కోల్పోవద్దని ప్రతి ఒక్కరి ఆకాంక్ష.

## ధాన్యం కొనుగోలు ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలి



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్:** జిల్లాలో యాసంగి పెండింగ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ అన్నారు. శనివారం అదనపు కలెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఉన్న రైతులతో మాట్లాడి, ధాన్యం కొనుగోలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం వర్షాబావ పరిస్థితులు ఉన్నందున ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే సంబంధిత రైస్ మిల్లులకు తరలించాలని, రైస్ మిల్లుల వద్ద ధాన్యం కోతలు లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన టార్పాలిన్ అందుబాటులో ఉండేలా చూడాలని, రైతులకు ఇబ్బందులు లేకుండా తగు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను అదనపు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, సంబంధిత శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతులను అడ్డుకున్న పోలీసులు



**ప్రజాపక్షం/చందుర్తి :** వరి ధాన్యం కొనుగోలు సజావుగా సాగడం లేదంటూ, వెంటనే వరి ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని నిరసన స్థిరపడానికి చందుర్తి మండల కేంద్రానికి వస్తున్న రైతులను పోలీసులు మార్గమధ్యంలోనే అడ్డుకున్నారు. మండలంలోని రామన్నపేట గ్రామానికి చెందిన రైతులు మండల కేంద్రంలో నిరసన తెలపడానికి ప్రయత్నించారు. ఇట్టి విషయాన్ని తెలుసుకున్న చందుర్తి ఎస్ఐ సిహెచ్ శ్రీకాంత్ మార్గమధ్యంలో రైతులను అడ్డగించి వారికి సర్ది చెప్పడానికి ప్రయత్నించారు. దీంతో రైతులకు పోలీసులకు మధ్య కొద్దిసేపు చిన్నపాటి వాగ్వాదం చోటు చేసుకుంది. అనంతరం ఎస్సై మాట్లాడుతూ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి ధాన్యం కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలవడంతో రైతులు వెనిదిరిగారు.

## ప్రకృతి సోయగం రమణీయం కమనీయం



**ప్రజాపక్షం/చందుర్తి:** ఈ చిత్రం చందుర్తి మండలం లింగంపేట గ్రామ శివారులోని పోలీసు అమరవీరుల స్తూపం వద్ద సమాజంలో శాంతిభద్రతల రక్షణలో భాగంగా తమ ప్రాణాలను తృప్రాయంగా అర్పించిన పోలీసు అమరవీరులకు ప్రకృతి ఈ ఎర్రని పుష్పాలతో నివాళులు అర్పిస్తున్నట్లుగా ఉంది. వివరాలలోకి వెళితే విధి నిర్వహణలో తమ ప్రాణాలను అర్పించిన పోలీసు అమరుల గుర్తుగా మండలంలోని లింగంపేట గ్రామ శివారు అటవీ ప్రాంతంలో పోలీసు అమరవీరుల స్థూపాన్ని నిర్మించారు. ప్రతి సంవత్సరం ఫ్లాగ్ డే సందర్భంగా ఇక్కడ పోలీసు అమరులకు జిల్లా పోలీసు బాస్ తో పాటు కలెక్టర్ అమరులైన పోలీసులకు నివాళులు అర్పిస్తూ ఉంటారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా ఇక్కడ నాటిన ఈ చెట్లు ప్రతి సీజన్లో పోలీసు అమరులకు నివాళులర్పిస్తూనే ఉంటాయి. ఈ ప్రకృతి సోయగం చూడడానికి ఎంతో కమనీయంగా రమణీయంగా ఉంది. ఆ పోలీసు అమరుల ఆత్మలు శాంతించాలని ఆ దేవుని కోరుకుందాం.

## ప్రభుత్వ పరంగా అన్ని విధాల ఆదుకుంటాం



**ప్రజాపక్షం/తంగళ్ళపల్లి:** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పిడుగుపాటుతో మృతిచెందిన ఇందిరానగర్ గ్రామం భరత్ నగర్ చెందిన రుద్రారపు చంద్రయ్య రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందిన జిల్లెళ్ళ గ్రామానికి చెందిన బచ్చపల్లి నరసయ్య కుటుంబ సభ్యులను పరామర్శించిన మండల కాంగ్రెస్ నేతలు రుద్రారపు చంద్రయ్య కుటుంబానికి రూ.5 వేలు బచ్చపల్లి నర్సయ్య కుటుంబానికి రూ.3 వేల ఆర్థిక సహాయం అందజేసిన టోనీ ప్రమాద వశాత్తూ మృతి చెందిన కుటుంబాలకు తనవంతు సహాయంగా ఒక్కో కుటుంబానికి 50 కేజీల బియ్యాన్ని అందజేసిన కాంగ్రెస్ నేత సత్తు శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి కేకే మహేందర్ రెడ్డి, ప్రభుత్వ పరంగా అన్ని విధాల ఆదుకొనే విదంగా హామీ ఇచ్చినట్లు తెలిపిన టోనీ మృతుల కుటుంబాలకు అండగా నిలవడానికి సంబంధిత అధికారులతో కేకే మహేందర్ రెడ్డి మాట్లాడినట్టు తెలిపిన నాయకులు ఈ కార్యక్రమంలో మండల, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్యాలయంలో డీజిల్ కుంభకోణం పై విచారణ



**ప్రజాపక్షం/వేములవాడ:** వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో 2022 సంవత్సరంలో 8 లక్షల రూపాయల డీజిల్ కుంభకోణం జరిగింది. దీనిపై మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేయడం జరిగింది. ఫిర్యాదు అనంతరం గతంలో మున్సిపల్ కార్యాలయంలో సానిటరీ ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వహించిన బి.నగేష్ ను వివరణ కోరగా ఆయన స్పందించకపోవడంతో అతన్ని జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేశారు. దీనిపై విచారణను త్రీమెన్ కమిటీకి అప్పగించి, జిల్లా కలెక్టర్ పూర్తి నివేదికను తెప్పించుకున్నారు. ప్రస్తుతం మున్సిపల్ కార్యాలయంలో ఆర్డిఎంఎ షాహిద్ మసూద్ నగేష్ కు సంబంధించిన జాయినింగ్ అయిన నాటి నుండి విధులు నిర్వహించిన కాలానికి సంబంధించిన ఫైళ్లను పరిశీలించి అతని స్టేట్మెంట్ రికార్డ్ చేసి దానిపై పూర్తి నివేదికను హైదరాబాద్ సిడిఎంఎ నివేదించనున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట మునిసిపల్ కమిషనర్ గోనె అన్వేష్, ఆర్డిఎంఎ కార్యాలయ సూపరింటెండెంట్, గుర్రం శ్రీనివాస్ పాల్గొన్నారు.

## టిఎస్ స్థానంలో టిజి తక్షణమే అమలు

(మొదటిపేజీ తరువాయి)

సంస్థలు, ఏజెన్సీలు, పబ్లిక్ సెక్టార్ యూనిట్లు, ఏజెన్సీలు, స్వయం ప్రతిపత్తి గల సంస్థలు, కార్పోరేషన్లు, వెబ్సైట్లు, ఆన్లైన్ ప్లాట్ ఫారమ్లు, ఏదైనా ఇతర అధికారిక కమ్యూనికేషన్లు సైతం తెలంగాణ కోడ్ను టీఎస్ బదులుగా టిజిని వాడాలని కలెక్టర్ కోరారు. లెటర్ హెడ్లు, రిపోర్టులు, నోటిఫికేషన్లు, అధికారిక వెబ్సైట్లు, ఆన్లైన్ ప్లాట్ ఫారమ్లు, పాలసీ పేపర్లు, జీవోలు, ఇతర అధికారిక కమ్యూనికేషన్లన్నింటిపై టిఎస్ స్థానంలో టిజిగా మార్చాలని పేర్కొన్నారు. శాఖలు ద్వారా భవిష్యత్తులో నిర్వహించే ఉత్తర, ప్రత్యుత్తరాలలో టిఎస్కు బదులుగా టిజిని ముద్రించాలని సూచించారు. ఈ మేరకు తీసుకున్న చర్యలపై ఈనెల 25వ తేదీలోపు అన్ని శాఖల జిల్లా అధికారులు తగిన నివేదికలు పంపాలని, ఆ నివేదికలు క్రోడీకరించి ప్రభుత్వానికి పంపనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

## మెడికల్ కౌన్సిల్ నకిలీ డాక్టర్లపై తీసుకున్న చర్యలు అభినందనీయం: సిపిఐ



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్:** జిల్లా కేంద్రంలో ప్రైవేట్ ఆసుపత్రుల్లో లైసెన్స్ లేని డాక్టర్స్ అనుమతి లేని హాస్పిటల్స్ ను అనాధికారికంగా నడిపిస్తూ ప్రజా ఆరోగ్యాలతో ప్రజలతో చెలగాట మాడుతున్న డాక్టర్ల అలాగే ఆసుపత్రి యజమాన్యాలపై కఠినమైన చర్యలు జిల్లా కేంద్రంలో గల భగత్ సింగ్ భవన్లో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రెస మీట్ పెట్టి ప్రకటించడం జరిగింది.ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి కే.రాజన్న మాట్లాడుతూ ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని ప్రజలను నిట నిలువుగా దోపిడి చేస్తూ దోచుకుంటున్నారని వారి దోపిడిని అడ్డుకట్ట వేయడానికి జిల్లా వైద్యా అధికారి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమని ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటమేని దీన్ని నియంత్రించవలసినటువంటి జిల్లా వైద్యాధికారి చోద్యం చూస్తూ వ్యవహరించడం సిగ్గుచేటు విషయమని అన్నారు.హాస్పటల్లో ఎలాంటి నిబంధన బోర్డులు ఫీజుల బోర్డులు టెస్టులకు సంబంధించిన బోర్డులు పెట్టకుండా కనీస సౌకర్యాలు కల్పించకుండా హాస్పటల్లో కనీనం బెడ పై బెడ్ షీట్ కూడా లేనటువంటి స్థితిలో నర్సింగోములు నడిపిస్తున్నారంటే ప్రజల ఆరోగ్యాల పట్ల ఎంత జాగ్రత్తగా ఉన్నారు.దీన్ని బట్టి తెలుస్తుందని అన్నారు.డాక్టర్లు దేవుళ్ళతో సమానమని వాపోయారు,అలాగే వారు రాస్తున్నవంటి రిస్క్రిప్షన్ లో అర్థం కాకుండా వ్రాయడము వారు సూచించినటువంటి మెడికల్ షాపుల్లో మందులు తీసుకోవాలని ఒత్తిడి చేయడం జరుగుతుందన్నారుప్రజల ప్రాణాలు కాపాడాలని అనుమతులు లేని మెడికల్,డయాగ్నొక్టిక్ సెంటర్స్ హాస్పిటల్ పై చర్యలు తీసుకొని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు.లేనిలో ఆదోళన చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నందిరామయ్య, ఎస్ గంగన్న ,బక్కన్న ,గపూర్ పాల్గొన్నారు.

## అమ్మవారికి కుంకుమపూజలు..



**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామంలో వాసవి కన్యకాపరమేశ్వరి మాత జయంతి సందర్భంగా ఆలయంలో ఘనంగా కుంకుమ పూజలు నిర్వహించారు.శనివారం అన్ని గ్రామలలో ఉన్న వైశ్యులు పరమేశ్వరునికి అభిషేకం నిర్వహించారు.అర్చన చేయించారు.అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.కార్యక్రమంలో ఆర్యవైశ్యులు ,మహిళలు,భక్తులు పాల్గొన్నారు.

## రోడ్డుప్రమాదంలో తీవ్రగాయాలు..



**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** ఎల్లారెడ్డిపేట మండలం పాతబస్టాండ్ ప్రాంతంలో రోడ్డు ప్రమాదంలో తిమ్మాపూర్కు చెందిన అంగన్వాడి ఉపాధ్యాయురాలి కూతురు,మరో వ్యక్తి ద్విచక్ర వాహనం పై వెళుతుండగా ద్విచక్ర వాహనాన్ని వెనుక నుండి జీప్ ఢీకొట్టింది,దీందో వెంటనే ఆమెను సమీపంలో ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.మరో మహిళకు స్వల్పంగా గాయాలతో బయటపడింది.పోలీసులు సమాచారం సేకరించారు.